సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం । 21 । జూన్ । 2023



యోగ.. సర్వరోగ నివారిణి

ఒత్తిడితో కూడిన నేటి జీవితంలో యోగ శరీరానికి ఊరటనిస్తుంది. నేడు అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం 8లో ▸



మద్దిలో ప్రత్యేక పూజలు

జంగారెడ్డిగూడెం రూరల్ : మద్ది ఆంజనేయ స్వామిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు.



పెళ్లికి నిరాకరించడంతో..

ప్రేమికురాలి కుటుంబ సభ్యులు పెళ్లికి నిరాకరించడంతో ప్రియుడు కలుపుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అత్తిలి మండలం ఆరవల్లిలో ఈ సంఘటన జరిగింది. 8లో ▸

న్యూస్‌రీల్

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం

కైకలూరు: సమాజంలో బాలకార్మిక వ్యవస్థను పూర్తి స్థాయిలో రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏలూరు జిల్లా డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ డి.శ్రీనివాస రావు అన్నారు. రాష్ట్ర స్థాయిలో జరుగుతున్న బాల కార్మికుల గుర్తింపు ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా కైకలూరులో బుధవారం దాడులు నిర్వహించారు. సంతమార్కెట్, రైతు బజారు, పూలకొట్టు, దుకాణాలలో తనిఖీలు చేసి కైకలూరు, మండవల్లి, ముదినేపల్లికి చెందిన ఐదుగురు బాలకార్మికులను గుర్తించారు. వీరిలో ఒక బాలిక ఉంది. వీరిని ఎంఈఓ కార్యాలయానికి తీసుకువెళ్ళి వివరాలు నమోదు చేసుకున్నారు. 18 సంవత్సరాలు దాటని వారిని పనిలో పెట్టుకుంటే కేసులు నమోదు చేస్తామన్నారు. దాడుల్లో విద్యాశాఖ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

డీఈఎల్ఈడీ పరీక్షలకు 168 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్ ఈడీ పరీక్షలు రెండో రోజు మంగవారం ప్రశాంతంగా జరిగాయి. 2వ సెమిస్టర్ పరీక్షలకు 149 మంది అభ్యర్థులకు 149 మంది నూరు శాతం హాజరు కాగా మొదటి సంవత్సరం సప్లిమెంటరీ పరీక్షలకు 71 మందికి 19 మంది హాజరయ్యారు. 52 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల్లో ఎలాంటి మాల్ ప్రాక్టీస్ కేసులు నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్వీ రవిసాగర్ తెలిపారు.

ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు ముందస్తు ఏర్పాట్లు



ఖరీఫ్ ధాన్యం కొనుగోలుకు సంబంధించి మాట్లాడుతున్న జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

సాక్షి, భీమవరం: ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తగిన ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను జాయింటు కలెక్టరు ఎస్.రామ్‌సుందర్ రెడ్డి ఆదేశించారు. మంగళవారం జాయింట్ కలెక్టర్ కార్యాలయం చాంబరులో గత ఖరీఫ్, రబీ ధాన్యం కొనుగోళ్లలో ఎదురైన సమస్యలు, ప్రస్తుత ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లకు చేపట్టాల్సిన చర్యలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలోని అన్ని రైస్ మిల్లుల్లో సీసీ కెమెరాలు, డ్రయర్ యంత్రాలను ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ధాన్యం అమ్మకాల్లో రైతులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా బరకాలు, గోనె సంచులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. రైతు భరోసా కేంద్రాల్లోని సిబ్బందికి శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి, ఎప్పటికప్పుడు దిశానిర్దేశం చేయాలన్నారు. దాళ్వాలో అకాల వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదురైనా సమష్టి కృషితో ధాన్యం కొనుగోలులో మంచి ఫలితాలు సాధించామని ఇదే స్ఫూర్తితో ధాన్యం కొనుగోలుకు సంసిద్ధులై రైతులకు మంచి సేవలు అందించాలని కోరారు. సమావేశంలో వ్యవసాయ శాఖాధికారి జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా సివిల్ సప్లయిస్ డీఎంటీ శివ రామ ప్రసాద్, డీఎస్‌వో యస్.సరోజ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు పటిష్ట ఏర్పాట్లు



భీమవరంలో ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణపై మాట్లాడుతున్న డీఆర్వో కృష్ణవేణి

సాక్షి, భీమవరం: జిల్లాలో టెన్త్, ఇంటర్మీడియట్ ఓపెన్ స్కూల్ పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా రెవెన్యూ అధికారిణి కె.కృష్ణవేణి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం డీఆర్వో చాంబర్‌లో పరీక్షల నిర్వహణపై ఆమె మాట్లాడారు. ఈ నెల 26 నుంచి జూలై 4 వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. టెన్త్ పరీక్షలకు 1,875 మంది విద్యార్థులకు 3 పరీక్షా కేంద్రాలు, ఇంటర్మీడియట్ 2,968 మంది విద్యార్థులకు 5 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. టెన్త్ పరీక్షలకు భీమవరం పట్టణంలోని మూడు పరీక్షా కేంద్రాలకు ఎస్‌సీహెచ్‌బీఆర్‌ఎంహెచ్‌ఎస్ పాఠశాలలో 670 మంది, జేఎల్‌బీఎంపీఎల్ ఉన్నత పాఠశాలలో 630 మంది, చిన్నరంగనిపాలెం ఎంపీఎల్ ఉన్నత పాఠశాలో 575 మంది విద్యార్థులు హాజరుకానున్నారని కృష్ణవేణి వివరించారు. ఇంటర్ పరీక్షలకు భీమవరం, ఆకివీడు, పాలకొల్లు పట్టణాల్లోని 5 పరీక్షా కేంద్రాలు ఏర్పాటుచేస్తున్నట్లు చెప్పారు.

● తొలకరి.. పలకరింపు



బుట్టాయగూడెం: మండలంలోని అచ్చియ్యపాలెం సమీపంలో ఆకాశంలో కారుమబ్బులు

ఏలూరు (మెట్రో): ఎట్టకేలకు వరుణుడు కరుణించాడు. గత కొద్ది రోజులుగా ఎండలతో అల్లాడిపోయిన ఉమ్మడి జిల్లా వాసులను తొలకరి పలకరింతతో ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చిరుజల్లులతో నైరుతి ఆరంభమైంది. సాయంత్రం కొన్ని ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురవగా, మరికొన్ని ప్రాంతాల్లో చిరుజల్లులు కురిశాయి. ఎండ వేడిమికి అల్లాడిపోతున్న భూమాత చిరుజల్లులకు పులకించింది. వర్షానికి పలుచోట్ల రోడ్లు జలమయం కాగా, మరికొన్ని ప్రాంతాల్లో వర్షానికి ప్రజలు ఇబ్బంది పడ్డారు. అన్నదాతలు చినుకు కోసం ఎదురుచూస్తున్న తరుణంలో ఈ వర్షం ఆనందాన్ని నింపింది. వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. మంగళవారం సాయంత్రం నుంచి బుధవారం ఉదయం వరకూ 3 నుంచి 4 సెం.మీ వర్షపాతం నమోదు కావచ్చని వాతావరణ శాఖాధికారులు అంచనా వేస్తున్నారు.

● ట్రిపుల్ ఐటీ ఆణిముత్యాలు



జగనన్న ఆణిముత్యాల కార్యక్రమంలో ప్రతిభ చూపిన విద్యార్థులను మంగళవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సన్మానించారు. నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు శ్రావణ్ సాయి కుమార్, నీలేష్‌లకు నగదు పురస్కారం అందజేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి -విజయవాడ

నైపుణ్య శిక్షణ.. ఉద్యోగ కల్పన

- నిరుద్యోగులకు వివిధ వృత్తి కోర్సుల్లో ఉచిత శిక్షణ
- ఉద్యోగావకాశాలు కల్పించడానికి నిరంతర జాబ్ మేళాలు
- 11,843 మందికి శిక్షణ పూర్తి



స్కిల్ హబ్‌లో శిక్షణ పొందుతున్న అభ్యర్థులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నిరుద్యోగులకు కావాల్సింది నిరుద్యోగ భృతి కాదు.. వారి అర్హతకు తగ్గ ఉద్యోగం అనే విషయాన్ని గట్టిగా నమ్మిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆ దిశగా వారికి ఉద్యోగ కల్పనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు. గతంలో కొన్ని ప్రభుత్వాలు నిరుద్యోగులకు భృతి ఇస్తామని చెబుతూనే కాలం వెల్లదీశాయి. అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు ఏర్పాటు చేసి లక్షల మందికి ఉద్యోగాలు కల్పించారు. ఇప్పుడు స్కిల్ హబ్‌లతో వేలాది మందికి ఉపాధి చూపుతున్నారు.

ప్రభుత్వ ఆదేశాలతో ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల నైపుణ్యాభివృద్ధి సంస్థల అధికారులు ఈ రెండు జిల్లాల్లో కలిపి 14 స్కిల్ హబ్‌ల ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఏలూరు జిల్లాలో ఏలూరు ప్రభుత్వ డీఎల్‌టీసీ, వట్లూరులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల, చింతలపూడిలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల, నూజివీడులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల, పోలవరం, కైకలూరుల్లో ప్రత్యేక స్కిల్ హబ్‌లు, భీమడోలులోని ఎస్వీ డిగ్రీ కళాశాలల్లో ఈ స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేశారు. పశ్చిమ గోదావరి జిల్లాలో ఆచంట ప్రభుత్వ ఐటీఐ కళాశాల, భీమవరంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల, తాడేపల్లి గూడెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, తణుకులో ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, పాలకొల్లులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, దుంపగడప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో, నరసాపురంలోని డీసీసీలో స్కిల్ హబ్‌లు ఏర్పాటు చేశారు.

వృత్తి విద్యా కోర్సుల్లో ప్రత్యేక శిక్షణ

తక్కువ విద్యార్హతలు ఉన్న వారితో పాటు ఉన్నత చదువులు చదివి ఉద్యోగావకాశాలు లభించక నిరుద్యోలుగా ఉన్న యువత కోసం వారిలో నైపుణ్యాలు అభివృద్ధి చేయడం కోసం ఈ స్కిల్ హబ్‌లను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ స్కిల్ హబ్‌లలో అభ్యర్థులకు డొమస్టిక్ ఎలక్ట్రికల్ సొల్యూషన్స్, అకౌంట్స్ ఎగ్జిక్యూటివ్స్, ఫోర్ వీలర్ సర్వీస్ టెక్నీషియన్స్, ఫిట్టర్ మెకానికల్ అసెంబ్లీ, అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, ఫీల్డ్ టెక్నీషియన్ కంప్యూటింగ్ పెరిఫెరల్స్, సీఆర్ఎం డొమస్టిక్ నాన్ – వాయిస్, డొమస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, అసిస్టెంట్ ప్లంబింగ్ జనరల్, అసిస్టెంట్ బ్యూటీ థెరపిస్ట్, వెబ్ డెవలపర్ వంటి కోర్సుల్లో ఉచితంగా శిక్షణ ఇస్తున్నారు.

ఒక్కో స్కిల్‌హబ్‌కు రూ.11 లక్షల నిధులు

ప్రాథమికంగా స్కిల్ హబ్‌ల ఏర్పాటుకు, వాటిలో కుర్చీలు, బల్లలు, డెస్కులు, ఫ్యాన్లు, వైరింగ్, సీసీ కెమెరాలు, స్మార్ట్ టీవీ, తాగునీటి సౌకర్యం తదితర సౌకర్యాల కల్పనకు ప్రాథమికంగా రూ.11 లక్షల నిధులను ప్రభుత్వం కేటాయించింది. వీటితో పాటు ఆయా కోర్సుల్లో శిక్షణ ఇచ్చే ట్రైనర్లకు, పారితోషికం , శిక్షణ పొందే ప్రతి అభ్యర్థికీ రూ.1000 స్టైఫండ్ ఇవ్వడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. మొదటి విడతలో ఎంపిక చేసిన కోర్సుల్లో శిక్షణ ముగియగా, మరికొన్ని స్కిల్ హబ్‌ల్లో రెండో విడతలో సైతం కొన్ని కోర్సుల్లో శిక్షణ పూర్తి చేశారు. కొన్ని స్కిల్ హబ్‌లలో రెండవ విడతకు, మరికొన్ని స్కిల్ హబ్‌లలో మూడవ విడత శిక్షణకు అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. వీటితో పాటు పార్లమెంట్ నియోజకవర్గాల ప్రాతిపదికన నైపుణ్య కళాశాలలను ఏర్పాటుకు సైతం ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఈ మేరకు ఇప్పటికే స్థల సేకరణ జరిగిపోగా కళాశాలల నిర్మాణానికి అవసరమైన నిధుల్లో కొంతభాగం విడుదల కూడా చేసింది.

ఏలూరులో 11,843 మందికి, పశ్చిమలో 42,454 మందికి శిక్షణ

ఏలూరు జిల్లాలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 8 పథకాల కింద గడిచిన మూడేళ్ళలో 11,843 మందికి వివిధ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించారు. 2019–20 సంవత్సరంలో మొత్తం 7,439 మందికి శిక్షణ ఇచ్చారు. 2020–21లో 3782 మందికి, 2021–22లో 622 మందికి శిక్షణ ఇచ్చారు. 2019–20లో వివిధ ప్రాంతాల్లో నిర్వహించిన జాబ్ మేళాల్లో పలు అంతర్జాతీయ, బహుళజాతి సంస్థలు పాల్గొని 1224 మందికి ఉద్యోగాలు కల్పించాయి. 2020–21లో నిర్వహించిన జాబ్ మేళాల్లో 664 మందికి, 2021–22లో నిర్వహించిన జాబ్ మేళాల్లో 2110 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు. పశ్చిమ గోదావరి జిల్లాలో 2019–20 సంవత్సరంలో 8,427 మందికి శిక్షణ ఇవ్వగా 212 మందికి ఉద్యోగాలు కల్పించారు. 2020–21లో 10,071 మందికి శిక్షణ ఇవ్వగా 389 మంది అభ్యర్థులు ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. 2021–22లో 11,110 మందికి శిక్షణ ఇవ్వగా 693 మందికి, 2022–23లో 12846 మందికి శిక్షణ ఇవ్వగా 892 మందికి ఉద్యోగావకాశాలు కల్పించారు.

నైపుణ్యాలకు పదును పెట్టడమే లక్ష్యం



యువతలో ఉన్న నైపుణ్యాలకు పదును పెట్టడమే లక్ష్యంగా స్కిల్ హబ్‌లు పని చేస్తున్నాయి. ముఖ్యంగా వివిధ వృత్తి విద్యా కోర్సులతో పాటు నేటి ఆధునిక సమాజంలో ఉద్యోగావకాశాలు మెండుగా ఉండే కోర్సుల్లో సైతం స్కిల్ హబ్‌లలో శిక్షణ ఇస్తున్నాం. స్కిల్ హబ్‌లలో శిక్షణ పొందిన వారికి వివిధ బహుళజాతి సంస్థలు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి.

– అన్నపురెడ్డి కృష్ణారెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం



ఏలూరు జిల్లా పరిధిలో వివిధ నియోజకవర్గాల్లో ఏర్పాటు చేసిన స్కిల్ హబ్‌ల్లో శిక్షణ కార్యక్రమాలు ఇప్పటికే ప్రారంభించాం. వాటిలో కొన్ని హబ్‌లలో తొలిబ్యాచ్ శిక్షణ పూర్తయింది. మరికొన్ని హబ్‌లలో తొలి బ్యాచ్ శిక్షణ ముగింపు దశకు చేరుకుంది. ఆయా నియోజకవర్గాల్లోని స్కిల్ హబ్‌లలో శిక్షణకు నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. ఈ నెల 25లోపు అభ్యర్థులు తమ దరఖాస్తులు పంపాలి. ఇతర వివరాలకు 8978524022, 9493482414 నెంబర్లలో సంప్రదించవచ్చు.

– ఈ.తమ్మాజీ రావు, ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి

పేదలకు ఉన్నత విద్య ప్రభుత్వ లక్ష్యం

మాజీ మంత్రి శ్రీరంగనాథరాజు



విద్యార్థులను సత్కరిస్తున్న మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు

పెనుగొండ: పేద విద్యార్థులకు ఉన్నత విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేలా జగనన్న ఆణిముత్యాల పేరిట ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. పెనుగొండ మండలం సిద్ధాంతంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం జగన్ రాష్ట్రంలో విద్యకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తున్నారని, రూ.వేల కోట్లు ఖర్చు చేస్తున్నారని అన్నారు. గతంలో విద్య అంటే కేరళ వైపు చూసే వారిని ఇప్పుడు ఏపీ వైపు చూస్తున్నారని, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్ద మొత్తంలో ఖర్చు పెడుతుందన్నారు. కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాయని అన్నారు. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకుని, ఉన్నత స్థానాలలో ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. అనంతరం ప్రథమ స్థానం పొందిన దేవాని శిరీష, గద్దం సుహాసినికి రూ. మూడు వేల నగదు బహుమతి, ద్వితీయ స్థానం పొందిన పళ్ళప్రోలు అఖిలకు రూ.2000, తృతీయ స్థానం పొందిన యాళ్ల రాధికకు రూ.1000 బహుమతులను అందించారు. సర్పంచ్ చింతపల్లి గనిరాజు (చంటి), ఎంపీటీసీ చిన్నం ఏడుకొండలు, పెచ్చెట్టి జేమ్స్, విద్య కమిటీ చైర్మన్ జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జగన్నాథ రథయాత్ర



ఆలయం నుంచి క్షేత్ర పురవీధులకు పయనమైన జగన్నాథుడి రథం



సుభద్ర, బలభద్ర, జగన్నాథుడి దారు విగ్రహాలు



రథం ముందు కోలాటం చేస్తున్న మహిళలు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన లక్ష్మీపురంలోని శ్రీ సంతాన వేణుగోపాల జగన్నా, వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో జగన్నాథుడి దివ్య రథోత్సవాలు మంగళవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ప్రతి ఏటా ఈ రథయాత్ర నిర్వహించడం సంప్రదాయంగా వస్తోంది. ఉత్సవాల ప్రారంభాన్ని పురస్కరించుకుని లక్ష్మీపురం ఆలయం నుంచి ద్వారకాతిరుమల క్షేత్రానికి ఈ రథయాత్ర సాయంత్రం అట్టహాసంగా సాగింది. ముందుగా ఆలయ సిబ్బంది రథాన్ని సుగంధ భరిత పుష్పమాలికలు, మామిడి తోరణాలు, అరటిబోదెలు, విద్యుద్దీప తోరణాలతో అలంకరించారు. అనంతరం సుభద్ర, బలభద్రుల సమేత జగన్నాథుని దారు విగ్రహాలను అర్చకులు, పండితులు వేద మంత్రోచ్ఛరణలతో ఆలయం నుంచి ఊరేగింపుగా తెచ్చి, రథంలో వేంచేపుచేసి విశేషంగా అలంకరించారు. ఆలయ ఇన్‌చార్జి ఈఓ ఎం.విజయరాజు, ఏఈఓ పి.నటరాజారావు, సూపరింటెండెంట్ రాజు రథ ముందు బలిహరణను సమర్పించి, పూజలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ రథ ముందుగా ఆలయం చుట్టూ తిరిగింది. ఆ తరువాత అశేష భక్తజనం, కోలాట భజనల నడుమ ద్వారకాతిరుమల క్షేత్రానికి చేరుకోగా, భక్తులు జగన్నాథుడిని దర్శించి తరించారు.

నాడు–నేడు పనులు వేగవంతం చేయాలి



నాడు-నేడు పనులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

పెనుగొండ: మనబడి నాడు–నేడు పనులు, ప్రభుత్వ భవనాల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టరు పి.ప్రశాంతి అధికారులకు సూచించారు. పెనుగొండ మండలం సిద్ధాంతం శివారు గటాలదిబ్బ ఎంపీపీ పాఠశాల నాడు–నేడు పనులు, చెరుకువాడ బీసీ బాలుర వసతి గృహం మొదటి అంతస్తు, ఇలపర్రు అంగన్‌వాడీ నిర్మాణ పనులను మంగళవారం ఆమె తనిఖీ చేశారు. నాడు–నేడులో ఇప్పటివరకు చేసిన ఖర్చులకు సంబంధించి బిల్లులు వెంటనే అప్‌లోడ్ చేయాలని కలెక్టరు సూచించారు. నాడు–నేడు పనులు అకౌంటబిలిటీతో బాధ్యతతో చేపట్టాలని, పనులలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని కలెక్టరు అన్నారు. మిగిలిన పనులు శ్రద్ధ పెట్టి పూర్తి చేయించాలని సూచించారు. పాఠశాలలో అన్ని గదులు, పరిసరాలతో పాటు ఆట స్థలం పరిశుభ్రంగా ఉంచాలని అన్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులదేనన్నారు. పాఠశాలలో యూనిఫాం గురించి ఆరా తీశారు. కలెక్టరు వెంట విద్యాశాఖఅధికారి ఆర్.వెంకట రమణ, పంచాయతీ రాజ్ శాఖ అధికారి శ్రీనివాసరావు, ఐసీడీఎస్ అధికారి బి.సుజాతా రాణి, తహసీల్దారు ఎన్.గురుమూర్తి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెనుమంట్రలో కలెక్టర్ సుడిగాలి పర్యటన

పెనుమంట్ర: పెనుమంట్రలో మన బడి నాడు–నేడు పథకంలో జరుగుతున్న పనులను మంగళవారం కలెక్టర్ పి.ప్రశాంతి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా పెనుమంట్ర మండలంలోని పెనుమంట్ర జడ్పీ ఉన్నతపాఠశాల, ఎస్సీపేట ఎలిమెంటరీ పాఠశాల, నెంబర్ 3 అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. ఖర్చులకు సంబంధించి బిల్లులను వెంటనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని కలెక్టర్ సూచించారు. నాడు నేడు పనులను అధికారులు అత్యంత బాధ్యతతో చేపట్టాలని పనులలో నాణ్యత లోపిస్తే క్షమించేది లేదని హెచ్చరించారు. పెనుమంట్ర జడ్పీ ఉన్నత పాఠశాలలో టాయిలెట్స్ నిర్మాణాలను ఇంకా పూర్తిచేయకపోవడం, ఎస్సీపేటలో ఎలిమెంటరీ పాఠశాల పనులు, అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలో జగనన్న లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణ పనులు ఎలా జరుగుతున్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆలమూరు, వెలగలేరు పంచాయతీ పరిధిలోని జగనన్న లేఅవుట్ పనులను, అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను ఆమె వెళ్లి పరిశీలించారు.

మెనూ ప్రకారం ఆహారం అందించాలి

పెనుమంట్ర అంగన్‌వాడీ భవన నిర్మాణ పనులను పరిశీలించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పక్కనే ఉన్న మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి కోడిగుడ్డు సైజు వాటిపై ముద్రించిన రంగుల గురించి ఉపాధ్యాయులను ఆరాతీసారు. కొందరు విద్యార్థులు యూనిఫాం ధరించకపోవడంతో జగనన్న విద్యాకానుక కిట్స్ పంపిణీ చేశారా లేదా అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసులు, ఐసీడీఎస్ ప్రాజెక్టు జిల్లా అధికారిణి బి.సుజాతరాణి, పెనుమంట్ర సీడీపీఓ మేరీ ఎలిజబెత్, తహసీల్దార్ డీవీఎస్ అశోక్‌వర్మ, ఎంపీడీఓ వి.పూర్ణబాబ్జి, ఎంఈఓ ఉంగరాల నాగేశ్వరరావు తదితరులు ఉన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులు నడిపితే కఠిన చర్యలు

భీమవరం(ప్రకాశంచౌక్): ఫిట్‌నెస్ పరీక్ష పూర్తి చేసుకుని సర్టిఫికెట్ పొందకుండా స్కూల్, కళాశాల బస్సులు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ అధికారి టి.ఉమామహేశ్వరరావు హెచ్చరించారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 1360 స్కూలు, కళాశాల బస్సులు ఉన్నాయని వాటికి సంబంధించి గత రెండు నెలలుగా రవాణా శాఖ అధికారులు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహిస్తున్నారని ఆయన తెలిపారు. స్కూలు, కళాశాల బస్సులకు సంబంధించి నిబంధనల ప్రకారం అన్ని సక్రమంగా ఉంటే సర్టిఫికెట్ జారీ చేస్తున్నామని తెలిపారు. ఇంతవరకు జిల్లాలో 1,173 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తిచేసి సర్టిఫికెట్లు జారీ చేశామన్నారు. అందులో భీమవరం రవాణా శాఖ కార్యాలయ పరిధిలో 448, తాడేపల్లిగూడెం రవాణాశాఖ కార్యాలయ పరిధిలో 310, తణుకు రవాణా శాఖ కార్యాలయం పరిధిలో 197 , పాలకొల్లు రవాణా శాఖ కార్యాలయ పరిధిలో 218 బస్సులకు పిట్‌నెస్ పరీక్షలు పూర్తి చేశామన్నారు. మిగిలిన 187 బస్సులలో 67 బస్సులు 14 ఏళ్లు దాటి ఉండడంతో వాటిని విద్యార్థులను రవాణా చేయడానికి పనికిరావని తిరస్కరించామని చెప్పారు. ఇక 120 బస్సులకు సంబంధించి ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాల్సి ఉందని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్‌లో 20 బస్సులపై కేసులు కూడా నమోదు చేసినట్లు తెలిపారు.

క్లుప్తంగా

'సామజవరగమన' సందడి


ఎస్ఆర్‌కేఆర్ కళాశాల విద్యార్థులతో సినీ హీరో, హీరోయిన్లు శ్రీవిష్ణు, మౌనిక జోహాన్

సాక్షి, భీమవరం: సామజవరగమన చిత్రం యూనిట్ భీమవరంలో సందడి చేసింది. స్థానిక ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులతో హీరో, హీరోయిన్లు శ్రీవిష్ణు, రెబ్ మౌనికజోహాన్ సెల్ఫీలు దిగి ఉత్సాహపర్చారు. ఈ సందర్భంగా హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ తనకు భీమవరం పట్టణమంటే ఎంతో అభిమానమని, అందువల్లనే తన చిత్రాల ప్రమోషన్ ముందుగా ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. గతంలో తాను నటించిన అల్లూరి చిత్రాన్ని ఈ ప్రాంత ప్రజలు ఎంతగానో ఆదరించారని గుర్తుచేశారు. తాను హీరోగా ఏకే ఎంటర్‌టైన్‌మెంట్ ప్రజెంటేషన్‌లో హాస్య మూవీస్ ఆధ్వర్యంలో నిర్మించిన సామజవరగమన సినిమాను ఈ నెల 29న విడుదలవుతోందని, ఈ చిత్రాన్ని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో చిత్ర దర్శకుడు ఆర్‌పి రాజు, సంగీత దర్శకుడు గోపి సుందర్, కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.సురేష్‌బాబు పాల్గొన్నారు.

నిత్య యోగ.. సర్వరోగ నివారిణి

- భారతదేశ యోగకు గుర్తింపు
- ప్రజల్లో పెరుగుతున్న ఆవశ్యకత
- నేడు అంతర్జాతీయ యోగ దినోత్సవం


కొవ్వలి ఉన్న పాఠశాలలో యోగ డే ఆకారంలో ఆకట్టుకున్న విద్యార్థులు


కైకలూరులో యోగ శిక్షణ (ఫైల్)

కైకలూరు/తణుకు అర్బన్: 'యోగ' అనే రెండక్షరాల పదం ప్రపంచ వ్యాప్తంగా ఆరోగ్యానికి ఓ తారకమంత్రం. ఉపనిషత్తులుగా పిలవబడే ప్రాచీన భారతీయ గ్రంథాల నుంచి యోగ ఉద్భవించింది. ప్రధాని మోదీ 2014లో ఐక్యరాజ్యసమితిలో మన దేశ యోగను ప్రతిపాదించగా ఏకగ్రీవంగా అన్ని దేశాలూ ఆమోదించాయి. నేడు 193 దేశాలలో అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. ఈ ఏడాది 'వసుధైవ కుటుంబానికి యోగ' అనే నినాదంతో యోగ డేను ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారు. ప్రభుత్వం ఆయూష్ విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా యోగ ఆవశ్యకతపై అవగాహన కలిగించనుంది. యోగ సాధన వల్ల కలిగే ప్రయోజనాలను వివరించేందుకు ఏటా జూన్ 21న అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఓషన్ రింగ్ ఆఫ్ యోగ అనే పేరుతో భారత్‌లోని త్రివిధ దళాలు ఒకే భూమి, ఒకే దేశం వంటి నినాదాలతో వినూత్నంగా యోగను ప్రదర్శించనున్నాయి.

ఆరోగ్యానికి పెద్దపీట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యానికి రాష్ట్రంలో పెద్దపీట వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో తొమ్మిదో అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నారు. ఇందుకు ఆయుష్ విభాగం కమిషనర్ అన్ని ఏర్పాట్లు చేశారు. పలు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లో యోగ ఆవశ్యకత, తపాల కవర్లు విడుదల, యోగ గురువులకు సన్మానం వంటి కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ప్రధానంగా యోగాసనాలపై గురువులు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

ఆసనాలతో ఆరోగ్యం

నేడు ఉరుకుల పరుగుల జీవితంలో యోగ శరీరానికి ఊరటనిస్తోంది. సూర్యనమస్కారాలను అధిక సంఖ్యలో ప్రజలు అలవాటు చేసుకున్నారు. ప్రాణామయా, ధ్యానం, సర్వాంగాసన వంటిని నిత్యం ఆచరిస్తున్నారు. యోగ ద్వారా అంతర్గత ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం, మనస్సు, శరీరం, ఆత్మను ఏకీకృతం చేయడం వంటి ప్రయోజనాలు కలుగుతాయి. ప్రతి రోజూ వ్యాయామాలు చేయడం వల్ల రోగ నిరోధకశక్తి పెరుగుతుంది.

- **సుప్తగర్భాసనం** : దీని ద్వారా కాళ్లు, చేతుల, నడుము భాగాలకు మంచి రక్తప్రసరణ జరిగి ధృడంగా మారతాయి. పొట్ట భాగంలోని కొవ్వు కరగడం వల్ల సకల రోగాలు హరిస్తాయి.
- **ఏకపాదగ్రీవాసనం** : దీని ద్వారా భుజభాగాలు, వక్షస్థలం శక్తివంతంగా తయారవుతాయి. పాదాలు ధృడంగా తయారవుతాయి. కండరాలు పటిష్టంగా మారతాయి.
- **ఆకర్ణధనుష్టంకారాసనం** : దీని ద్వారా ఏకాగ్రత పెరుగుతుంది. మెడ నరాలు బలంగా తయారవుతాయి. చేతులు, కాళ్లు ధృడంగా మారతాయి.
- **స్కందపాదాసనం** : దీని ద్వారా కాళ్లు, చేతులు, మెడ భాగాలు పటిష్టమవుతాయి. కడుపు భాగంలో ఉన్న కొవ్వు శాతం కరుగుతుంది.
- **మయూరాసనం** : దీని ద్వారా జీర్ణాశయం పనితీరు మెరుగవుతుంది. మధుమేహ వ్యాధి అదుపులో ఉంటుంది. మలబద్ధకాన్ని నిరోధించి మూత్రపిండముల పనితీరు బాగవుతుంది.
- **పద్మాసనం** : దీని ద్వారా వెన్నెముకకు బలం చేకూరుతుంది. మోకాలి నొప్పులు తగ్గుతాయి. కాళ్ల కండరాలు శక్తివంతమవుతాయి.

మానసిక ప్రశాంతత



యోగను నిత్యజీవితంలో భాగం చేసుకోవాలి. పతాంజలి యోగ ఆరోగ్య కేంద్రం ద్వారా దాదాపు 20 వేల మందికి యోగను నేర్పాను. యోగ ప్రచార పరిషత్ ద్వారా 30 కేంద్రాల ద్వారా యోగను అందరికీ అందిస్తున్నాం. చిన్ననాటి నుంచి యోగను అందరూ అలవర్చుకోవాలి. వివిధ దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి యోగ స్వాంతన చేకూరుస్తుంది.
– యోగ ఆచార్య సాంబశివరావు, పతాంజలి యోగ ఆరోగ్య కేంద్రం, ఆకివీడు

వేలాదిమందికి యోగతో సంతృప్తి



గత 20 ఏళ్లుగా తణుకుతోపాటు పలు ప్రాంతాల్లో ఉచితంగా యోగ నేర్పిస్తున్నాను. మానవాళి మనుగడకు యోగ నిత్య ఔషధిలాంటిది. తణుకు ఎన్‌జీవోస్ హోం, ఇతర ప్రాంతాల్లో ఇప్పటివరకు కొన్ని వేల మందికి ఉచితంగా యోగ నేర్పించిన తృప్తి నాకుంది. పది మంది ఒకే చోట ఉంటే చాలు యోగ నేర్పిస్తాననే నా ప్రచారం జిల్లా నలుమూలలా తాకింది. ఇదే స్ఫూర్తితో అందరికీ యోగ అందించగలుగుతున్నాను. – కర్రి శ్రీనివాసరెడ్డి, యోగ గురువు

శ్రీవారి సేవలో సీఐడీ ఐజీ


సీఐడీ ఐజీ శ్రీకాంత్‌కు శ్రీవారి మెమెంటోను అందిస్తున్న ఆలయ ఏఈఓ రాజు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని సీఐడీ ఐజీ (ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ విజయవాడ) శ్రీకాంత్ మంగళవారం సాయంత్రం సందర్శించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఏఈఓ కేఎల్ఎన్ రాజు స్వామివారి మెమెంటోను, ప్రసాదాలను అందజేశారు. తొలుత ఆయనకు దేవస్థానం అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆలయ ప్రొటోకాల్ ఏఈఓ ఆర్.లక్ష్మణస్వామి, ఎస్సై టి.సుధీర్ తదితరులున్నారు.

చినకామనపూడిలో గుడిసెలు దగ్ధం


అగ్నిప్రమాదంలో దగ్ధమైన ఇళ్లు

ముదినేపల్లి రూరల్: ముదినేపల్లి మండలం చినకామనపూడి గ్రామ సరిహద్దు వెంబడి కాలువగట్టుపై ఉన్న ఐదు గుడిసెలు మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమయ్యాయి. దీంతో దేవరకొండ నాగేశు, దేవరకొండ నాగచింతాలు, బండి రాంబాబు, బండి కొండలయ్య, బండి చిన్నోడు కుటుంబాలు కట్టుబట్టలతో మిగిలాయి. గృహోపకరణలు పూర్తిగా కాలిపోయాయి. వారు రోజుమాదిరిగా ఉదయం కూలి పనులకెళ్లిన సమయంలో ప్రమాదం సంభవించింది. ఇంటి నిర్మాణం కోసం బీరువాలో దాచిన నగదు కాలిపోయిందని బండి రాంబాబు, ఇంటిలో దాచివుంచిన నగదు కాలిపోయిందని బండి కొండాలయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనాస్థలికి సర్పంచ్ చిట్టూరి నాంచారయ్య, తహసీల్దార్ కె.శ్రీనివాస్, వీఆర్వో కిషోర్ చేరుకుని ప్రమాద వివరాలను సేకరించారు. ప్రభుత్వం తరపున నష్టపరిహారం అందించేందుకు కృషి చేస్తామన్నారు. కైకలూరు అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలికి చేరుకునే లోపే ఇళ్లన్నీ కాలిబూడిదయ్యాయి. ప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణమని, ఆస్తి నష్ట సుమారు రూ.8 లక్షల వరకు ఉంటుందని అగ్నిమాపక అధికారులు అంచనా వేశారు.

వేధింపుల కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: అధిక కట్నం కోసం వేధిస్తున్నట్లు వివాహిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వేగవరం గ్రామానికి చెందిన యర్రమాల ఇందు ప్రియకు, టి.నరసాపురం మండలం రుద్రకోటరాజుగూడానికి చెందిన యర్రమాల నాగబాబుతో ఏడాది క్రితం వివాహమైందన్నారు. వివాహ సమయంలో రూ.1.10 లక్షలు కట్నంగా ఇచ్చారని, ఆరు నెలలు వీరి కాపురం బాగానే సాగిందని తెలిపారు. అనంతరం నాగబాబు అదనపు కట్నం తీసుకురావాలని ఇందుప్రియను శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడన్నారు. ఈ క్రమంలో ఇందుప్రియను ఇంటి నుంచి గెంటివేయగా, వేగవరంలోని ఆమె తల్లిదండ్రుల వద్ద ఉంటోందని చెప్పారు. నాగబాబు వేగవరం వచ్చి ఇందుప్రియతో గొడవపడి బెదిరింపులకు పాల్పడ్డాడన్నారు. ఇందుప్రియ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

నీటితొట్టెలో పడి చిన్నారి మృతి


పూజిత (ఫైల్)

జంగారెడ్డిగూడెం రూరల్: అమ్మమ్మ ఇంటి ఆవరణలో ఆనందంగా ఆడుకుంటున్న చిన్నారిని నీటి తొట్టి మింగేసింది. నీటి తొట్టిలో పడిన రెండేళ్ల చిన్నారిని ఎవ్వరూ గుర్తించకపోవడంతో ఊపిరాడక మృతి చెందిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం శ్రీనివాసపురంలో మంగళవారం చోటుచేసుకుంది. జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంకు చెందిన వామిశెట్టి గోపి, రాశి దంపతులకు ఇద్దరు కుమార్తెలు. వీరిలో రెండో కుమార్తె పూజిత. పూజితతో కలిసి శ్రీనివాసపురంలో ఉంటున్న రాశి అమ్మవారి ఇంటికి గోపి, రాశి వెళ్లారు. పూజిత ఆడుకుంటూ ఇంటి పరిసరాల్లో ఉన్న నీటి తొట్టిలో ప్రమాదవశాత్తు పడిపోయింది. దీనిని ఎవ్వరూ గమనించకపోవడంతో ఊపిరాడక తొట్టెలోనే పూజిత మృతి చెందింది. పూజిత మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు.

కల్వర్టు పైకి దూసుకువెళ్లిన స్కూల్ బస్సు

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం వెంకటాపురం వద్ద స్కూల్ బస్సు మంగళవారం సాయంత్రం అదుపుతప్పి రాపాక చానెల్ కల్వర్టుపై దూసుకెళ్లింది. తృటిలో పెనుప్రమాదం తప్పింది. పెనుమంట్ర మండలం నెలమూరు గ్రామానికి చెందిన ఓ ప్రైవేటు స్కూల్ బస్సు లంకలకోడేరు వైపు వస్తుండగా వెంకటాపురం వద్ద రాపాక చానెల్ కల్వర్టుపై దూసుకుపోయి ఆగింది. ఆ సమయంలో బస్సులో 25 మంది విద్యార్థులున్నారు. విద్యార్థులెవరికీ గాయాలు కాలేదు. దీంతో తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం


స్వాధీనం చేసుకున్న బియ్యంతో అధికారులు

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం వేగవరంలో మంగళవారం అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని పౌర సరఫరాల శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. 480 బస్తాలో ఉన్న 24,000 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నామని, వీటి విలువ లారీతో కలిపి రూ.13.32 లక్షలు అని జిల్లా పౌరసరఫరాల అధికారి (డీఎస్ఓ) రుద్రరాజు సత్యనారాయణ తెలిపారు. ఖమ్మంకు చెందిన ఆత్మకూరు జగదీశ్ జంగారెడ్డిగూడెం మండల పరిసర గ్రామాల నుంచి బియ్యం కొనుగోలు చేసి కాకినాడ తరలిస్తుండగా పట్టుకున్నట్టు చెప్పారు. జగదీశ్, లారీ డ్రైవర్, ఓనర్ షేక్ నాగూర్ కేసులు నమోదు చేశామన్నారు. ఈ తనిఖీల్లో ఏఎస్ఓ ప్రతాప్ రెడ్డి, సివిల్ సప్లై డీటీ వైవీ లక్ష్మీకుమారి పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సర్వీసును బలోపేతం చేద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న ఏటీఎం జీఎల్‌పీవీ సుబ్బారావు

ఏటీఎం (కార్గో) లక్ష్మీ ప్రసన్న వెంకట సుబ్బారావు

నూజివీడు: ఆర్టీసీ కార్గో సర్వీసును బలోపేతానికి కార్మికులు తమ సహకారాన్ని అందజేయాలని ఆర్టీసీ ఏలూరు ఏటీఎం (కార్గో) జి.లక్ష్మీ ప్రసన్న వెంకట సుబ్బారావు అన్నారు. స్థానిక ఆర్టీసీ డిపోను మంగళవారం ఆయన సందర్శించిన ఏటీఎం కార్మికులతో సమావేశాన్ని నిర్వహించారు. ఇతర జిల్లాలతో పోల్చుకుంటే నూజివీడు ఆదాయం తక్కువగా ఉందని, ఆదాయం పెంపునకు ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని అన్నారు. డిక్కీ బుకింగ్, రూఫ్ టాప్ బుకింగ్, కంటైనర్‌ను ముందుగానే బుకింగ్ చెసుకోవచ్చన్నారు. ఆర్టీసీ కార్గో సర్వీసు పార్శిళ్లను వేగంగా గమ్యస్థానాలకు చేర్చుతుందని చెప్పారు. 50 కిలోల బరువు వరకు 10 కి.మీ.లోపు ఉచితంగా డెలివరీ సదుపాయం ఉందన్నారు. నిర్ణయించిన ధర మాత్రమే వసూలు చేయాలని, ఎక్కువ వసూలు చేసినా, సమస్యలున్నా ఫోన్ నెంబరు 73311 47263కు తెలియజేయాలన్నారు. డిపో మేనేజర్ సీహెచ్ సూర్య పవన్‌కుమార్ మాట్లాడుతూ ఈనెల 24న వేలాంగిణికి, జులై ఒకటో తేదీన అరుణాచలంకు బస్సు సర్వీసు ఏర్పాటు చేశామని చెప్పారు. అరుణాచలంకు టిక్కెట్ ధర రూ.2,600ని, మార్గ మధ్యలో శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్‌టెంపుల్ దర్శించుకొని అరుణాచలం చేరుకుంటుందని తెలిపారు. గిరి ప్రదక్షిణం పూర్తయిన అనంతరం తిరిగి బస్సు బయలుదేరుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ ఏడాది వేసవిలో కార్గో సర్వీసు ద్వారా ఆశించిన ఆదాయం వచ్చిందన్నారు. మార్చి నెలలో రూ.2 లక్షలు, ఏప్రిల్‌లో రూ.4.54 లక్షలు, మే నెలలో రూ.11.58 లక్షలు, జూన్ నెలలో రూ.2.92 లక్షల ఆదాయం వచ్చిందని చెప్పారు. కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది పాల్గొన్నారు.

పెళ్లికి నిరాకరించడంతో ప్రియుడి ఆత్మహత్య


దివ్యసాయిరెడ్డి(ఫైల్)

అత్తిలి: ప్రేమించిన యువతి కుటుంబీకులు పెళ్లికి నిరాకరించడంతో ప్రియుడు కలుపుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏఎస్సై ఎస్ వెంకట్రావు తెలిపిన వివరాల ప్రకారం.. అత్తిలి మండలం ఆరవల్లి గ్రామానికి చెందిన దివ్యసాయి రెడ్డి, అదే గ్రామానికి చెందిన కోనాల అనంతలక్ష్మి గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరిద్దరి పెళ్లికి యువతి తల్లిదండ్రులు ఒప్పుకోకపోవడంతో ఈనెల 12న వారు ద్వారకాతిరుమలలో వివాహం చేసుకున్నారు. అక్కడ నుంచి హైదరాబాద్ వెళ్లారు. యువతి తండ్రి వెంకటరెడ్డికి ఆరోగ్యంబాగోలేదని, ఇంటికొస్తే తమ వివాహం జరిపిస్తామని కుటుంబ సభ్యులు తెలపడంతో దివ్యసాయిరెడ్డి, అనంతలక్ష్మి ఆరవల్లికి వచ్చారు. ఐతే యువతిని తల్లిదండ్రులు ఇంటికి తీసుకువెళ్లిపోగా, పెళ్లికి నిరాకరించడంతో మనస్థాపానికి గురైన దివ్యసాయిరెడ్డి సోమవారం కలుపుమందు తాగాడు. వైద్యం నిమిత్తం పెనుమంట్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తణుకు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. దివ్యసాయిరెడ్డి తండ్రి శ్రీనివాసరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కేసు దర్యాప్తు చేపట్టామని ఏఎస్సై వివరించారు.

పరంజాపై నుంచి పడి కార్మికుడి మృతి


సూర్యనారాయణ మృతదేహం

పాలకొల్లు అర్బన్: పాలకొల్లు మండలం ఉల్లంపర్రులో మంగళవారం భవన నిర్మాణ పని చేస్తుండగా పరంజా జారిపోవడంతో కింద పడిన రెడ్డి సూర్యనారాయణ (40)కు ఇనుప ఊచలు గుండెల్లో గుచ్చుకున్నాయి. మరో కార్మికుడు మధు నాగేంద్రకు గాయాలయ్యాయి. సూర్యనారాయణను స్థానికులు హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. పట్టణంలోని దేవునితోటకు చెందిన సూర్యనారాయణకు భార్య ఉన్నారు. ఈ ప్రమాదంపై తమకు ఫిర్యాదు అందలేదని రూరల్ పోలీసులు తెలిపారు.

పాము కాటుతో వ్యక్తి మృతి

చింతలపూడి: చింతలపూడి పట్టణంలో మంగళవారం పాముకాటుతో వ్యక్తి మృతి చెందాడు. స్థానిక ఒక ప్రైవేటు పాఠశాలలో నైట్ వాచ్‌మెన్‌గా పని చేస్తోన్న చొక్కా నాగరాజు (45) అనే వ్యక్తి సోమవారం రాత్రి విధుల్లో ఉండగా పాము కాటేసింది. మంగళవారం ఉదయం అపస్మారక స్థితిలో ఉన్న నాగరాజును సిబ్బంది ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు ఎస్సై హరికృష్ణ కేసు దర్యాప్తు చేపట్టారు.

ఆకట్టుకుంటున్న బంగారు ఆభరణాల ప్రదర్శన


వేగ బంగారు ఆభరణాల ప్రదర్శనను ప్రారంభిస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వేగ జ్యూయలర్స్ ఆధ్వర్యంలో స్థానిక హోటల్ గ్రాండ్ ఆర్యలో ఏర్పాటు చేసిన బంగారు ఆభరణాల ప్రదర్శన నగర ప్రజలను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శనను మంగళవారం ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి, ఏలూరు జిల్లా అధ్యక్షురాలు కూరాళ్ల రమాదేవి, ఏలూరు అర్బన్ జిల్లా కార్యదర్శి తవ్వా శిరీష ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు వనమా నవీన్, వనమా సుధాకర్ మాట్లాడుతూ మంగళప్రదమైన వేడుకలకు, వివాహాది శుభకార్యాలకు కావాల్సిన విశిష్ట ఆభరణాలను ఈ ప్రదర్శనలో ఉంచామన్నారు. పోల్కీ జ్యూవెలరీపై మేకింగ్, వేస్టేజ్ చార్జీలు ఉండవని, రూ.2 లక్షల విలువైన బంగారం, వజ్రాల కొనుగోలుపై 1 గ్రాము గోల్డ్ కాయిన్ ఉచితంగా అందిస్తామని చెప్పారు. దేశం నలుమూలల నుంచి ప్రముఖ డిజైనర్స్ రూపొందించిన ఎన్నో రకాల ఆభరణాలను ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంచామని, తమ వేగ జ్యూయలర్స్ బ్రాండ్ షోరూంలను తెలుగు రాష్ట్రాల్లోని మరికొన్ని నగరాలకు విస్తరించే ప్రతిపాదన ఉందని తెలిపారు.

వరి సాగులో విత్తనశుద్ధే కీలకం

- చీడపీడల నివారణ.. దిగుబడి మెరుగు
- జిల్లాలో 2.39 లక్షల ఎకరాల్లో వరిసాగు


విత్తనశుద్ధి చేసే విధానాన్ని రైతులకు వివరిస్తున్న పాలకోడేరు ఏఓ నారాయణరావు (ఫైల్)

సాక్షి, భీమవరం: దాళ్వా వరి సాగులో మంచి దిగుబడులు సాధించిన రైతులు అదే ఉత్సాహంతో సార్వా సాగుకు సన్నద్ధమవుతున్నారు. రెండు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో వరి నారుమళ్లు వేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ఇప్పటికే వరి విత్తనాలు సిద్ధం చేసుకోగా నారుమళ్ల దమ్ములకు చేలలో నీరు పెడుతున్నారు. విత్తనశుద్ధికి ప్రాధాన్యత ఇవ్వడం వల్ల విత్తనాలు వేగంగా మొలకెత్తడమేగాక చీడపీడల నుంచి బయటపడొచ్చని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలోని 20 మండలాల పరిధిలో సుమారు 2.39 లక్షల ఎకరాల్లో వరిసాగుచేయాల్సుంది. దీనికి దాదాపు 47,800 కింట్వాళ్ల విత్తనాలు అవసరం. వీటిలో ఎక్కువ శాతం విత్తనాలు రైతులే స్వయంగా సమకూర్చుకుంటారు. మిగిలిన రైతులకు రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం విత్తనాలు సిద్ధం చేసింది. ప్రస్తుత సార్వా సీజన్‌కు ఎంటీయూ 1318, ఎంటీయూ 1061, ఎంటీయూ 1064, ఎంటీయూ 7029 వరి వంగడాలు అనుకూలంగా ఉంటాయని వ్యవసాయశాఖ ప్రచారం చేస్తోంది.

విత్తనశుద్ధి ఇలా..

డెల్టా ప్రాంతంలో ఎకరం విస్తీర్ణంలో వరినాట్లు వేయడానికి 25 కిలోల విత్తనాలు నారుమడికి వేసుకోవాల్సుంటుంది. మెట్ట భూముల్లో సాగుకు వెద జల్లే పద్ధతికి 20 కిలోలు, శ్రీపద్ధతికి రెండు కిలోలు, యాంత్రికరణ పద్ధతికి సుమారు 15 కిలోల విత్తనాలు అవసరం. కిలో విత్తనాలకు 3 గ్రాముల కార్బెండజిమ్ మందును కలిపి 24 గంటల తరువాత నారుమడిలో చల్లుకోవాలి. దంప నారుమళ్లు వేసే రైతులు కిలో విత్తనాలను లీటరు నీటిలో గ్రాము కార్బెండజిమ్ మందును కలిపి 24 గంటలు నానబెట్టిన తరువాత మండెకట్టి మొలకెత్తిన విత్తనాలను నారుమడిలో చల్లుకోవాలి.

నిద్రావస్థను తొలగించడం ఇలా..

విత్తనాలు నూర్పిడిచేసిన తరువాత తక్కువ రోజులైతే విత్తనాలకు నిద్రావస్థ ఉంటుంది. దీంతో మొలక శాతం తక్కువగా ఉండడంవల్ల ఎక్కువ విత్తనాలు వినియోగించాల్సి ఉంటుంది. నిద్రావస్థను తొలగించేందుకు లీటరు నీటిలో 6.3 మిల్లీ లీటర్ల గాడనత్రికామ్లం మందును కలిపి, ఆ ద్రావణంలో 24 గంటలు నానబెట్టాలి. తరువాత మరో 24 గంటల పాటు విత్తనాలను మండెకట్టి చల్లుకుంటే మొలకశాతం ఎక్కువగా ఉంటుంది.

ప్రయోజనాలు అనేకం



వరిసాగు చేసే రైతులు నారుమళ్లు వేసే ముందు విత్తనశుద్ధి చేస్తే అనేక ప్రయోజనాలుంటాయి. ప్రధానంగా విత్తనశుద్ధి వల్ల విత్తనాల్లో మొలకశాతం అధికంగా ఉంటుంది. విత్తనాల ద్వారా వచ్చే క్రిమికీటకాలు నశిస్తాయి. ఫలితంగా వరి పైరుకు పెద్దగా చీడపీడలు దరిచేరవు. పెట్టుబడి ఖర్చు తగ్గడమేగాక అధికదిగుబడులు సాధించవచ్చు.
– జెడ్ వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయ శాఖాధికారి, భీమవరం

క్లుప్తంగా

80 శాతం నారుమడులు పూర్తి



తాడేపల్లిగూడెం మండలం కొత్తూరులో నారుమడులను పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలో 80 శాతం నారుమడులు పూర్తయ్యాయని మండల వ్యవసాయాధికారి ఆర్ఎస్.ప్రసాద్ తెలిపారు. మంగళవారం మండలంలోని నందమూరు, ఆరుళ్ళ, నవాబుపాలెం,ఆరుగొలను, కొత్తూరు, జగన్నాథపురం గ్రామాల్లో నారుమడులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో ప్రసాద్ మాట్లాడుతూ వర్షాలు ప్రారంభం కావడంతో నారుమడి పోసుకోవాలని సూచించారు. కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డులను తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బీకే ఇన్‌చార్జ్ ఎ.స్వాతి, సెక్రటరీ విజయలక్ష్మి, రైతులు తిరుమళ్ల సూర్యనారాయణ, శ్రీనివాస్, బాదం సూర్యచంద్రరావు, గూడవల్లి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మను దర్శించిన డీపీవో



శ్రీముత్యాలమ్మ వారిని దర్శించిన డీపీవో మల్లిఖార్జునరావును సత్కరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని ముత్యాలంబాపురం శ్రీముత్యాలమ్మ వారిని మంగళవారం జిల్లా పంచాయతీ అధికారి జీవీకే.మల్లిఖార్జునరావు దర్శించుకున్నారు. తొలుత ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి పి.హరే రామ్‌ప్రసాద్, జూనియర్ అసిస్టెంట్ హరిబాబు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

తాగునీటి చెరువులో తామరాకుల తొలగింపు



కొండేపాడులో తాగునీటి చెరువును శుభ్రం చేసిన దృశ్యం

పెంటపాడు: మండలంలోని బి.కొండేపాడు గ్రామంలో తాగునీటి చెరువులో గుర్రపుడెక్క, తామరాకులతో ప్రజల పాలిట శాపంగా మారింది. ఎట్టకేలకు పంచాయతీ కార్యదర్శి శ్రీరంగ ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చిట్టడవిలా తలపించే ఆ చెరువు శుభ్రం చేయడంతో గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలో తాగునీటి విషయంలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

యోగా ఆరోగ్యానికి ఆయుధం

సాక్షి, భీమవరం: యోగా ఆరోగ్యానికి ఆయుధం వంటిదని, వయస్సుతో ప్రమేయం లేకుండా అందరూ యోగా చేయడం వల్ల శారీరక, మానసికంగా ఆరోగ్యం పొందవచ్చునని భీమవరం ఆర్డీఓ దాసి రాజు అన్నారు. ఎస్‌సీహెచ్ బీఆర్ఎం హైస్కూల్ విద్యార్థులతో మంగళవారం శ్రీ విజ్ఞానవేదిక అధ్వర్యంలో యోగ దినోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన యోగ అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రాచీనకాలంలో యోగా వల్ల జీవనప్రమాణాన్ని పెంచుకోగలిగారని అందువల్ల దైనందిన జీవితంలో యోగ ఒక భాగంగా ముందుకు సాగాలన్నారు. అన్నివర్గాల ప్రజలకు ఉపయోగపడే ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో శ్రీవిజ్ఞానవేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, హైస్కూల్ హెచ్ఎం శ్రీనివాసరావు, ఫిజికల్ డైరెక్టర్‌స జిపిసి శేఖర్‌రాజు, పి.రామబద్రిరాజు తదితరులు పాల్గొన్నారు.

పంటకాలువలో ప్లాస్టిక్ వ్యర్థాల తొలగింపు

భీమవరం అర్బన్: మండలంలోని అనాకోడేరు పంటకాలువలో మంగళవారం ప్లాస్టిక్ వ్యర్థాలు సాగు, తాగునీరు ప్రవాహానికి ఆటంకం కలగడంతో తొలగించారు. జూన్ 1న ఇరిగేషన్ అధికారులు పంటకాలువ ద్వారా నీటిని విడుదల చేయడంతో రెగ్యులేటర్ల వద్ద ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారం పేరుకుపోయాయి. దీంతో ఇరిగేషన్ అధికారులు వెంటనే స్పందించి తమ సిబ్బందితో ప్లాస్టిక్ వ్యర్థాలు, చెత్త చెదారం తొలగిస్తున్నారు. ఇరిగేషన్ ఏఈ భూపతిరాజు వెంకట ప్రసాదరాజు మాట్లాడుతూ పంటకాలువల్లో చెత్త, చెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దిగువ గ్రామాల ప్రజలు ఈ నీటినే తాగుతున్నారని గమనించి ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.

బీమాతో పాడిరైతు ధీమా

- పశువులకు ప్రమాద బీమా అందిస్తున్న ప్రభుత్వం
- జూన్ ఒకటి నుంచి వైఎస్సార్ పశుబీమా పథకం ప్రారంభం





పశువులు, గొర్రెలు (అంతర చిత్రం)

పెంటపాడు: మనుషులకే కాదుపశువులకూ ప్రమాద బీమా అవసరమే. ఏదైనా ప్రకృతి విపత్తులు, ఇతర ప్రమాదాలు సంభవించిన సమయంలో పశువులు మృతి చెందుతున్నాయి. ఆ సమయంలో పెంపకదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ నష్టాన్ని భర్తీ చేసుకునేందుకు ప్రభుత్వం వైఎస్సార్ పశుబీమా పథకం అమలు చేస్తోంది. పాడి రైతులు నష్టపోకుండా చర్యలు తీసుకుంటోంది. నామమాత్రపు ప్రీమియం చెల్లించడం ద్వారా మూడేళ్లపాటు పశువులకు బీమా కల్పిస్తుంది. ఈ బీమా చెయిస్తు ప్రమాదవశాత్తు పాడి పశువు, గొర్రెలు, మేకలు ఇతర పశువులు చనిపోయినప్పుడు పరిహారం పొందే అవకాశం ఉంటుంది. గతంలో వైఎస్సార్ పశు నష్ట పరిహారం పథకం ఉండేది. దీనిలో పశువు విలువ ఎంత ఉన్నా గర్థింగా పాడి పశువుకి రూ.90వేలు, గొర్రె, మేకలకు రూ.6వేలు చొప్పున అందిచే వారు. ఒక్కో రైతులకుఐదు పాడి పశువుల వరకు, గొర్రెలు, మేకలకు ఇరవై వరకు గరిష్ఠంగా అందించేవారు. ఇప్పుడు ఈ పథకం స్థానంలో వైఎస్సార్ బీమా పథకం తీసుకొచ్చారు. పశువుల విలువలను బట్టి బీమా చెల్లిస్తారు.

బీమ ప్రభుత్వ వాటా....

బీమా పథకంలోపశువు విలువ ఎంత ఉంటుందో అంతకి బీమా చెల్లించే వెసులుబాటు ఉంటుంది. ఉదాహరణకు పాడి పశువు విలువ రూ.1.50లక్షలు ఉంటే అంత మొత్తాన్ని బీమా చెల్లించుకోవచ్చు. బీమాకి చెల్లించే ప్రీమియం మొత్తంలో ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీని మినహాయించి రైతులు మిగిలిన సొమ్ము చెల్లించుకోవాలి. జూన్ ఒకటో తేదీ నుంచి ఈ పథకం ప్రారంభమవుతుంది. ఈ పథకంలో పశువులు, గొర్రెలు, మేకలు చనిపోతే పదిహేను రోజుల్లోనే బీమా మొత్తం పొందే అవకాశం ఉంటుంది. ఎస్సీ, ఎస్టీలతో పాడు దారిద్ర్యరేఖకు దిగువన(బీపీఎల్) ఉన్న పశు పెంపకదారులు ప్రీమియంలో ఇరవైశాతం వాటా చెల్లించాలి. 40శాతం చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. దరిద్ర్యరేఖకు ఎగువున ఉన్న వారు 50శాతం వాటా ప్రీమియం వాటాను లబ్ధిదారులు, 25 శాతం చొప్పున కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరో 50శాతం ప్రీమియాన్ని చెల్లిస్తాయి. ప్రతి కుటుంబానికి ఐదు పాడి పశువులు, 50గొర్రెలు, మేకలు, పందులకు పశుబీమా ద్వారా పరిహారం పొందే అవకాశం ఉంది.

లబ్ధిదారుల చెల్లింపు

- ఈ పథకంలో రూ.30వేలు ఖరీదైన గేదె, ఆవుకి మొత్తం ప్రీమియం మూడేళ్ల 6.4శాతం అంటే రూ.1920గా నిర్ధారించవచ్చు. దీనిలో ఎస్సీ, ఎస్టీ బీపీఎల్ లబ్ధిదారులు రూ.384లు, ఏపీఎల్ కేటగిరి వాళ్లు రూ.960చొప్పున లబ్ధిఆరుల వాటాగా చెల్లించాలి.
- రూ.15వేలు ఖరీదు చేసే గేదె, ఆవుకు మూడేళ్లకు రూ.960లుగా ప్రీమియం నిర్ణయించారు. దీనిలో ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ లబ్ధిదారులు రూ.192లు, ఏపీఎల్‌రూ.480లుగా చెల్లించాలి.
- 6వేలు విలువైన గొర్రె, మేక పందులకు మొత్తం సంవత్సారానికి మూడు శాతం చొప్పున రూ.180లు, రెండేళ్లకు రూ.270, మూడేళ్లకు రూ.375లు చొప్పున ప్రీమియం చెల్లించాలి. దీనిలో ఒకటి నుంచి మూడేళ్ల ప్రీమియం కింద ఎస్టీ,ఎస్టీ బీపీఎల్ లబ్ధిదారుడు రూ.96,రూ.54, రూ.75లు చొప్పున, ఏపీఎల్ వాళ్లు రూ.90, రూ.135, రూ.187.50 చొప్పున లబ్ధిదారుడి వాటా చెల్లించాల్సి ఉంటుంది.

బీమా చేయాల్సిన విధానం.

- అర్హత కలిగిన పాడి రైతులు, గొర్రెలు, మేకలు పందుల పెంపకందారులు బీమా చెల్లించేందుకు సమీపంలో ఉండే రైతు భరోసా కేంద్రాలు, పశు వైద్యశాలలో గానీ సంప్రదించాలి
- రెతు, పెంపకందారుడు ఆధార్, రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలి
- నామినీ వివరాలు, పేరు, రిలేషన్, నామినీ పుట్టిన తేదీ కరెక్టుగా నింపాలి.
- వైఎస్సార్ పశుబీమా చేసిన ప్రతి పశువుకి చెవిపోగు(ఇయర్ ట్యాగ్) తప్పనిసరిచేయించాలి. ట్యాగ్ లేకపోతే బీమా సదుపాయం పొందే అవకాశం కోల్పోతారు. -బీమా మూడేళ్లకి చేసిన పశువుకి ట్యాగ్ మిస్ అయితే మళ్లీ వేయించుకోవాలి.

పదిహేను రోజుల్లోనే పరిహారం



వైఎస్సార్ పశుబీమా పథకంలో చేరితే పశువు చనిపోయిన పదిహేను రోజుల్లోనే పరిహారం పొందవచ్చు. జూన్ 1నుంచి బీమా ప్రీమియం చెల్లించాలి. పశువు విలువ ఎంత ఉంటే అంత విలువకూ బీమా సదుపాయం వర్తించే అవకాశంఉంటుంది. బీమా ప్రీమియం చెల్లింపులో ప్రభుత్వ సబ్సిడీ పోను మిగిలిన సొమ్ము రైతు, పెంపకందారుడు చెల్లించాలి. పాలిచ్చే పశువునిబట్టి దాని విలువను పశువైద్యాధికారులు నిర్ధారిస్తారు.

– డాక్టర్ కె. నరసింహరావు, డివిజన్ పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్. పెంటపాడు

వర్షంతో ఊరట



తాడేపల్లిగూడెం పట్టణంలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షం దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: నైరుతి రుతుపవనాలు ప్రవేశించడంతో తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఒక మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు ఎండ తీవ్రతకు ఉక్కపోతతో ప్రజలు అల్లాడిపోయారు. తదుపరి ఒక్కసారిగా ఆకాశం మేఘావృతమై ఉరుములతో కూడిన వర్షం కురిసింది. సాయంత్రం 5.30 గంటల వరకు వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని పలు రహదారులు తడిసి ముద్దయ్యాయి. ఈ వర్షంతో వేసవి ఎండల నుంచి ప్రజలు ఉపశమనం పొందారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

తాడేపల్లిగూడెం (టీఓసీ): తాడేపల్లిగూడెం డిపో పరిధిలో నడుస్తున్న సర్వీసులు, లాజిస్టిక్స్(కార్గో)పార్సిల్ సౌకర్యాలను తెలుసుకునేందుకు బుధవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల మధ్య 99592 25488కు ఫోన్ చేయవచ్చన్నారు. డిపో అభివృద్ధికి ప్రయాణీకులకు మెరుగైన సేవలు అందించేందుకు సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు.

సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న మెంటార్ భూపాల్

తాడేపల్లిగూడెం రూరల్: లక్షల రూపాయల విలువ చేసే కెమెరా కొనుగోలు చేసినప్పటికీ, సాంకేతికతపై అవగాహన లేకపోతే ప్రయోజనం శూన్యమని మెంటార్ భూపాల్ అన్నారు. ఫొటో ట్రేడ్ యూనియన్, తాడేపల్లిగూడెం ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని ఉషా గ్రాండ్‌లో కెమెరా సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెంటార్ భూపాల్ మాట్లాడుతూ ఫొటో, వీడియోగ్రాఫర్లు తాము వినియోగించే మిర్రర్ లెస్ కెమెరాలపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. అలాగే ఈ రంగంలో ముందుకు సాగాలంటే క్రియేటివిటీ ముఖ్యమన్నారు. సీనరీలను సృష్టించగలిగినప్పుడే ఫొటోగ్రఫీ రంగంలో మనగలమన్నారు. కెమెరాల్లోని సదుపాయాలను వినియోగించుకుని ఐబీఎస్, హెచ్‌డీఆర్ ఫార్మాట్‌లలో స్పష్టమైన చిత్రాలను చిత్రీకరించినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ఉమ్మడి గోదావరి గోదావరి జిల్లా అధ్యక్షుడు ఎం.రాము, పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు పి.శ్యామ్‌బాబు, జిల్లా గౌరవాధ్యక్షుడు బి.గిరిబాబు, తణుకు అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ సబ్బీర్, కార్యదర్శి జి.మురళీకృష్ణ, తాడేపల్లిగూడెం అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ముళ్ళపూడి చిరంజీవి, కార్యదర్శి డి.సురేష్‌కుమార్, ఉపాధ్యక్షుడు కె.ఆశీర్వాదరావు, కెనాన్ ఏపీ మేనేజర్ వరుణ్, అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

వాసవి, వనిత క్లబ్ సేవలు అభినందనీయం



సంజీవనగర్ ఉన్నత పాఠశాలలో విగ్రహాలు ఆవిష్కరణ కార్యక్రమంలో వాసవి క్లబ్, వనతి క్లబ్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని వాసవి క్లబ్, వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత గుండె వైద్య శిబిరం మంగళవారం టూ టౌన్‌లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరీ సత్రంలో నిర్వహించారు. కామినేని ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిచే 200 మందికి ఈసీజీ, ఈసీహెచ్‌ఓ, షుగర్, తదితర పరీక్షలు నిర్వహించి అవగాహన కల్పించారు. తొలుత వాసవి క్లబ్ జిల్లా గవర్నర్ కె.కృష్ణాజి అధికార పర్యటన పట్టణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు జరిగాయి. నిరుపేద మహిళలకు కుట్టు మిషన్లు అందజేశారు. 50 మంది వృద్ధులకు చీరలు, దుప్పట్లు, బియ్యం, వృద్ధాప్య పెన్షన్‌లు అందజేశారు. సంజీవనగర్ ఉన్నత పాఠశాలలో మహాత్మాగాంధీ, పొట్టి శ్రీరాముల విగ్రహాలను ఆవిష్కరించారు. 175 మంది పిల్లలకు పుస్తకాలు, పెన్నులు, బిస్కెట్లు, చాక్లెట్స్ అందజేశారు. 9వ వార్డు అంగన్‌వాడీ స్కూల్‌లో స్టీల్ కంచాలు, పౌష్టికాహారం అందజేశారు. పడాల వృద్ధాశ్రమంలో సిమ్మెంట్ బెంచ్‌లు అందజేశారు. వృద్ధులకు టవల్స్, సబ్బులు, పండ్లు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ అధ్యక్షుడు శీమకుర్తి రాజా, వనతి క్లబ్ అధ్యక్షురాలు ఆలపాటి అచ్యుత లక్ష్మి, పి.సత్య కోటేశ్వరి, ఎం.లావణ్య, కృష్ణకుమార్, ఎం.భాస్కరం, నున్న సుందరరావు, జి.బాల మురళీకృష్ణ, కేదారిశెట్టి రవికుమార్, బ్రహ్మాజీ, స్వర్ణకాంతి, ప్రభ, అనిల్, పవన్, పులవర్తి రాంపండు, మల్లిఖార్జున్, రమేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా కొప్పిశెట్టి రమణయ్య



విరాళం అందించిన దాత పదంకుమార్ గుప్తాకు సత్కారం చేస్తున్న డైమండ్స్ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని లయన్స్‌క్లబ్ ఆఫ్ డైమండ్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం బుద్దాల కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. నూతన అధ్యక్షుడిగా కొప్పిశెట్టి రమణయ్య, ప్రధాన కార్యదర్శి మద్దూకూరి మెహర్ ప్రసాద్, కోశాధికారిగా మునగాల జితేంద్ర, ఉపాధ్యక్షుడిగా కోటి విజయ్ కిషోర్, సహాయ కార్యదర్శిగా పట్నాల రామకృష్ణ, జొన్నల సతీష్ కుమార్, పూతినీడి శివరామకృష్ణ, ఎస్.సత్యనారాయణ, ఆనందస్వరూప్‌లు ప్రమాణ స్వీకారోత్సవం చేశారు. పదంకుమార్ గుప్తా డైమండ్స్ క్లబ్ సర్వీస్ పోగ్రాంనకు లక్ష రూపాయిలు విరాళం అందజేశారు. చక్కని చదువులు చదువుతున్న, ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంస పత్రాలు అందజేశారు. కోనా హనుమాన్‌చే నిరుపేదలకు 6 గురికి 6 బస్తాల బియ్యం, నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు, కిషోర్ కుమార్, పదంకుమార్ గుప్తా, బుద్దాల వెంకట రామారావు, మదన్ మోహన్ అగర్వాల్, పేరిచర్ల మురళీకృష్ణంరాజు, నూకల నాగ మల్లేశ్వరరావు, వట్టిప్రోలు రాములు పాల్గొన్నారు.

విద్యుత్ సిబ్బంది భద్రతా ప్రమాణాలు పాటించాలి



తణుకులో విద్యుత్ భద్రతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు, సిబ్బంది

తణుకు: విద్యుత్ శాఖలో పని చేసే క్షేత్రస్థాయి సిబ్బంది భద్రతా ప్రమాణాలు పాటిస్తే ఎలాంటి విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారించవచ్చని తాడేపల్లిగూడెం విద్యుత్ శాఖ డీఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. తణుకు సబ్‌డివిజన్ పరిధిలోని క్షేత్రస్థాయి సిబ్బందికి సోమవారం రాత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డీఈ మాట్లాడుతూ ప్రతి విద్యుత్ కార్మికుడు విద్యుత్ పనులు చేసే సమయంలో తప్పనిసరిగా హెల్మెట్, సేఫ్టీ బెల్ట్, ఎర్త్‌రాడ్ వినియోగించాలని సూచించారు. స్తంభంపై పని చేసే సమయంలో సెల్‌ఫోన్ వాడకం నివారించాలన్నారు. అనంతరం తణుకు ఏడీఈ సీహెచ్ రామకృష్ణ సిబ్బందితో విద్యుత్ భద్రత మనందరి బాధ్యత అని ప్రతిజ్ఞ చేయించారు. విద్యుత్‌శాఖ ఏఈలు సాధిక్, జాన్సన్, రవి ప్రసాద్, జూనియర్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

నేడు మండల మానవత సమావేశం

పెంటపాడు: మండల మానవత కార్యవర్గ సమావేశం బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక ఎస్వీపీఎస్ హిందూ హైస్కూల్లో నిర్వహించనున్నట్లు జిల్లా మానవత సంస్థ అధ్యక్షుడు తాడేపల్లి మోహనరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గం ఎన్నిక, ప్రమాణస్వీకారోత్సవం వైభవంగా జరుగుతుందన్నారు. దీంతో పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక నగదు, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో గెలుపొందిన వారికి బహుమతులు, మెమొంటోలు, ధ్రువపత్రాలు మోటివేషన్ పుస్తకాలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశాన్ని మండల మానవత సంస్థ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని మోహనరావు కోరారు.

ముగిసిన సామాజిక తనిఖీ ప్రజావేదిక



పెంటపాడు మండలంలో ఉపాధి సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న డ్వామా పీడీ రాజేశ్వరరావు

పెంటపాడు: ఉపాధి పనులకు సంబంధించి సిబ్బంది చిత్తశుద్ధి, శ్రద్ధ, పారదర్శకత ఉండాలని జిల్లా డ్వామా పీడీ ఎస్టీవీ రాజేశ్వరరావు పేర్కొన్నారు. పెంటపాడు మండల వీరన్న ఓపెన్ ఆడిటోరియంలో మంగళవారం ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజావేదిక ఎంపీడీవో సీహెచ్ బాలాజీ, ఎంపీపీ దాసరి హైమావతిల అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డ్వామా పీడీ రాజేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధి పనుల్లో క్షేత్రసహాయకులు రికార్డులను సక్రమంగా నమోదు చేసుకోవాలన్నారు. టీఏలు, ఎంబుక్‌లు సక్రమంగా సరిచూసుకోవాలన్నారు. చేసిన పనులకు, ఇచ్చిన వేతనాలకు సామాజిక తనిఖీల్లో పోలిక లేకపోతే చర్యలు తప్పవన్నారు. ఈ సందర్భంగా 2022–23 సంవత్సరానికి సంబంధించి గ్రామాల వారిగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈజీఎస్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్, ఏపీఈడబ్ల్యూఐడీసీ శాఖలకు సంబంధించి రూ. 9.17 కోట్ల రూపాయల పనులు జరిగాయన్నారు. కూలీలు నష్టపోయేలా క్షేత్రసహాయకులు పనిదినాలు సక్రమంగా నమోదు చేయకపోవడం వల్ల 22 పంచాయతీలకు సంబంధించి వారి వద్ద నుంచి రూ. 42,338 వసూలు చేసామన్నారు. అలాగే ఎంబుక్ సక్రమంగా లేకపోవడం, కొలతల్లో తేడాల వల్ల రూ. 5.74 లక్షలు నష్టం జరిగినట్లు గుర్తించామన్నారు. ఆ సొమ్మును సాంకేతిక సహాయకుని వద్ద నుంచి వసూలు చేస్తామన్నారు. అదే విధంగా పీఆర్‌లో లోపాల కారణంగా రూ. 4872 రూపాయలు, క్షేత్రసహాయకుల రికార్డులు సరిగా లేని కారణంగా 22 గ్రామాలకు సంబంధించి రూ.24 వేల నగదు అపరాద రుసుం విధించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్టీఏఎం. గౌరీశంకర్, ఎస్ఆర్‌పీ పున్నపునాయుడు తణుక క్లష్టర్ ఏపీడీ వీరాస్వామి, డీఆర్‌పీలు, ఆయా శాఖల అధికారులు, హౌసింగ్ డీఈ ప్రసాద్, ఏఈ శివరామకృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ యు. నవీన్, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఏఈ ఎం. శ్రీనివాస్, ఆయా సర్పంచ్‌లు ఉపాధి క్షేత్ర సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని పాతూరు 33/11కేవీ సెమి ఇండోర్ సబ్ స్టేషన్ పరిధిలో ఈ నెల 21వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11 కేవీ జెడ్పీ ఫీడర్‌కు మరమ్మతులు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. మసీద్ రోడ్డు, పాతూరు ఏరియాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

కౌలు రైతులకు గుర్తింపు కార్డు తప్పనిసరి



అత్తిలి మండలం స్కిన్నెరపురంలో మాట్లాడుతున్న ఏఓ రాజేష్

అత్తిలి: కౌలుసాగుదారులు తప్పనిసరిగా రెవెన్యూ శాఖ జారీ చేసే కౌలు గుర్తింపు కార్డు (సీసీఆర్‌సీ) పొందాలని వ్యవసాయశాఖ అధికారి టీకే రాజేష్ చెప్పారు. మంగళవారం అత్తిలి మండలం మంచిలి, పాలి, స్కిన్నెరపురం గ్రామాల్లో సీసీఆర్సీ కార్డులపై కౌలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ రాజేష్ మాట్లాడుతూ ప్రస్తుత ఖరీఫ్, రబీ సీజన్‌కు సంబంధించి కౌలురైతులు సీసీఆర్‌సీ తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. గుర్తింపు కార్డు ఉన్న కౌలుదారులకు మాత్రమే సంబంధించిన పంటను నమోదు చేయడానికి వీలుంటుందని, వారికే ప్రభుత్వం అందించే రుణాలకు అర్హత ఉంటుందని తెలిపారు. సీసీఆర్‌సీ ఉన్న కౌలుదారులు పంట కొనుగోలు కేంద్రాల్లో విక్రయించుకోవడానికి, పంట నష్టం జరిగినప్పుడు నష్టపరిహారం, పంటల బీమా పొందడానికి అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు తమ్మాబత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విప్పర్రు సుబ్రహ్మణ్యేశ్వరునికి ప్రత్యేక పూజలు



విప్పర్రు గ్రామంలో సంతాన సుబ్రహ్మణ్యేశ్వరునికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే పసల కనక సుందర్రావు, వైఎస్సార్ సీపీ నాయకులు తదితరులు

పెంటపాడు: విప్పర్రులో ప్రసిద్ధి చెందిన సంతాన సుబ్రహ్మణ్యేశ్వరుని ఆలయంలో ఆషాడ మాసం తొలి మంగళవారం పురస్కరించుకొని స్వామివారికి విశేష పూజలు జరిగాయి. తెల్లవారు జాము నుంచి ప్రారంభమైన ఈ పూజల్లో స్వామివారికి పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అర్చకులు కొడవటిగంటి నరసింహాచార్యుల బ్రహ్మత్వంలో ఆలయ ధర్మకర్తలు, వైస్సార్ సీపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే పసల కనకసుందర్రావు, మాజీ సర్పంచ్ గంగా రామ చంద్రన్, తదితరులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు బువ్వనపల్లికి చెందిన దాత మునినాని మునలయ్య, ప్రభ దంపతులు అన్నసమరాధన చేశారు. ప్రతి మంగళవారం ఈ ఆలయంలో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయని మాజీ సర్పంచ్ గంగారామచంద్రన్ తెలిపారు.

విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

తణుకు టౌన్: విద్యార్థులు తమ సంకల్పానికి సమయాన్ని, తెలివితేటలను జోడిస్తే విజయం సాధించవచ్చని క్లినికల్ సైకాలజిస్ట్ కోట శ్రీనివాసరావు చెప్పారు. మంగళవారం తణుకు పైడిపర్రు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన స్కూల్ మెంటల్ హెల్త్ ప్రోగ్రాం కార్యక్రమంలో ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. విద్యార్థులు సమయాన్ని సద్వినియోగం చేసుకుని చదివితే పరీక్షల్లో నూరు శాతం విజయాన్ని సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఎం ఏడుకొండలు, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలపాలిట వరం ఫ్యామిలీ ఫిజీషియన్



సీతారాంపురం నార్త్ గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ నిర్వహిస్తున్న వైద్యులు

నరసాపురం రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ పథకం పేద, మధ్యతరగతి ప్రజల పాలిట వరంగా మారింది. తూర్పుతాళ్లు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని సీతారాంపురం నార్త్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఏ చిరంజీవి రోగులను పరీక్షించి అవసరమైనవారికి మందులను పంపిణీ చేశారు.

అధిక ఫీజులను నియంత్రించాలని వినతి

సాక్షి, భీమవరం: ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో విద్యార్థులనుంచి పెద్ద మొత్తంలో వసూలుచేస్తున్న ఫీజు దోపిడిని అరికట్టాలని అఖిలభారత విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) నాయకులు ఆర్డీఓ దాసి రాజుకు వినతిప్రతం అందజేశారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలో ఏబీవీపీ నగర్ సహాయ కార్యదర్శి వీడీ సిద్దార్థ ఆధ్వర్యంలో వినతిప్రతం అందించారు. సిద్ధార్థ మాట్లాడుతూ ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజులు, యూనిఫాం, పుస్తకాలు పేరిట పెద్ద మొత్తంలో వసూలుచేస్తున్నారన్నారు.